కూలీల కొరత తీరినట్టే..

- ఆధునిక సాగువైపు అన్నదాత
- యంత్రాల ద్వారా వరినాట్లు
- దిగుబడి వస్తుందంటున్న రైతులు
- ఖర్చు, సమయం ఆదా


వెదిరలో యంత్రంతో వరినాట్లు

రామడుగు: వర్షాలు అనుకూలంగా కురుస్తుండడంతో వర్షం నీటితో చెరువులు, కుంటలు నిండుగా ఉన్నాయి. రైతులు వరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యంలో కూలీల కొరతను అధిగమించే దిశగా అన్నదాతలు అడుగులు వేస్తున్నారు. వరి నాటు యంత్రాలతో నాట్లు వేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. దీంతో కూలీల సమస్య తీరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో....

మండలంలోని 23 గ్రామాల్లో అన్నదాతలు దాదాపు 16 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. వరి కూలీలతో మాత్రమే సాగు చేయాల్సి రావడంతో కూలి భారీగా పెరిగింది. దీంతో పాటు కూలీలు లేకపోవడంతో ఇతర మార్గాల వైపు రైతులు ఆలోచనలు చేస్తూ ప్రధానంగా వరి నాటే యంత్రంతో నాట్లు వేస్తున్నారు.

ప్రత్యేకంగా నారుమడి

వరి నాటే యంత్రంతో వరి నాటుకోవడానికి అవసరమైన నారుమడిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. ప్లాస్టిక్ కవర్స్ పరిచి దానిపై ప్రత్యేకంగా మట్టిబెడ్స్‌ను ఏర్పాటు చేసి అందులో వరి విత్తనాలను చల్లి వాటిపై వారం రోజుల పాటుగా షేడ్‌నెట్స్ కప్పి నారు పెంచుతారు. తర్వాత 25 నుంచి 30 రోజుల్లోపు వరి నాటు యంత్రంతో నాటు వేస్తారు.

కూలీలు లేకుండానే...

వరి నాటు యంత్రంతో కూలీల అవసరం లేకుండానే రైతులు ఐదేళ్లుగా పంట పొలాల్లో నాటు వేసుకుంటూ మంచి దిగుడి సాధిస్తున్నారు. మండలంలో యంత్రాలతో పాటు బీహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు కూడా ముమ్మరంగా వరినాటు వేస్తున్నారు. దీంతో రైతులకు కూలీల సమస్య తప్పినట్టయింది. యంత్రాలతో వేసిన వరి పంట మొక్కల మధ్య ఖాళీ స్థలం ఉండడంతో పంట రోగాల బారిన పడకుండా ఉండడంతో పాటుగా మంచి పిలకలు వచ్చి దిగుబడి వస్తుందని వెదిర గ్రామానికి చెందిన రైతు భూపతి తెలిపారు. రైతులు వరి నాటు యంత్రంతో దాదాపుగా రూ.4,500తో ఎకరం నాటు వేసుకోవచ్చు. దిగుబడి కూడా ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్లు వస్తుందని తెలిపారు.


నాటేసేందుకు ప్రత్యేక నారుమడి

తక్కువ ఖర్చు



వరినాటు యంత్రంతో మంచి దిగుబడి వస్తుందని ఈసారి రెండెకరాల్లో వరి నాటు యంత్రంతో నాటు వేశాను. కూలీల అవసరం లేకుండానే నాటు వేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. తక్కువ ఖర్చుతో వరి నాటు వేసుకునే అవకాశం ఉంది.

– సత్యనారాయణరెడ్డి, రైతు, వెదిర

యంత్రం వైపు మొగ్గు



ఐదేళ్లుగా వరినాటు యంత్రం నడుపుతున్నాను. రైతులకు. ప్రధానంగా కూలీల సమస్య తీరిపోయింది. రామడుగుతోపాటు చుట్టుపక్కల మండలాల్లోని రైతులు మిషన్ వరి నాటుకే మొగ్గు చూపుతున్నారు.

– తొరికొండ కిషన్, వరి నాటే యంత్రం యాజమాని, కొండన్నపల్లి

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన నంది అవార్డు గ్రహీత ప్రభు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: జిల్లా కలెక్టర్ గోపిని నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మారెపెల్లి మొగిలయ్య, హుజూరాబాద్ బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు అంబాల రాజు, ఆర్టీఐ సంయుక్త కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మహేందర్

హుజూరాబాద్: అవయవదానంతో ప్రమాదంలో ఉన్న మరొకరిని కాపాడవచ్చని రాష్ట్ర పోస్టల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఊకంటి మహేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని పోస్టాఫీసులో నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే సందర్భంగా పోస్టల్ ఉద్యోగులకు అవయవదానంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఎన్‌వోటీటీని స్థాపించి అవయవదానం సులభతరం చేసిందన్నారు. దేశ పౌరులందరికి అవగాహన కల్పించడంతో పాటు అపోహలు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. సమావేశంలో హెడ్ పోస్టాఫీసు ఇన్‌స్పెక్టర్ అరికాల నరేశ్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

గన్నేరువరం: అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే మండలం బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. గుండ్లపల్లి నుంచి వయా గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. ఎనిమిది నెలలుగా డబుల్ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాయకులు ఇదిగో అదిగో అంటున్నారే తప్పా ఒక్క అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులకు బంద్‌తోనైనా కనువిప్పు కలుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకులు సంపతి ఉదయ్, సీపీఐ(ఎంఎల్) నాయకులు బామండ్ల రవీందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీటీడీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఐత హరీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలతో పంటలు నీటమునిగాయని ఇన్‌పుట్‌సబ్సిడీ ఇవ్వాలని, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం పరిశీలించి వెంటనే నివేదికను ప్రభుత్వానికి అందించి నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామగిరి అంకూస్, ప్రతాప రాజు, ఫయాజ్, ఇల్లందుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

6న డబుల్ రోడ్డు పనులు ప్రారంభం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

గన్నేరువరం: డబుల్ రోడ్డు పనులను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ 6న ప్రారంభించనున్నారని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లల్లో మండలం అన్నిరంగాల్లో విశేష అభివృద్ధి సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పంచాయతీలు పోటీల్లో నిలిచాయని తెలిపారు. ప్రతిపక్షాల ఆరాటం ప్రజల కోసం కాదని విమర్శించారు. పనుల ప్రారంభోత్సవంలో భాగంగా గుండ్లపల్లి స్టేజీ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నామని, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మండల కోఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ, ఉపసర్పంచుల ఫోరంల మండల అధ్యక్షుడు గూడెల్లి అంజనేయులు, బూర వెంకటేశ్వర్లు, సర్పంచులు చంద్రారెడ్డి, కుమ్మర సంపత్, చెన్నాల నగేశ్, నాయకులు న్యాత సుధాకర్, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు సురేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

శంకరపట్నం: సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కేశవపట్నంలో గురువారం ఏఐఎస్ఎఫ్ మండల సమావేశం నిర్వహించారు. హాస్టళ్లను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శిస్తే విద్యార్థుల బాధలు తెలుస్తాయని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సాగర్, వెంకటేశ్, విజయ్, మహేశ్, అరవింద్, పవన్, అఖిల్ పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠం


సుందరగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ వినీత


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుధారాణి

చిగురుమామిడి: పుట్టిన శిశువుకు తల్లిపాలే శ్రేష్ఠమని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. గురువారం మండలంలోని సుందరగిరిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గీకురు రవీందర్, సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, ఎంపీటీసీ సభ్యుడు మెడబోయిన తిరుపతి, సీడీపీవో సబితాకుమారి, మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్, వార్డు సభ్యులు వంతడ్పుల దిలీప్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, పల్లెదవాఖాన వైద్యులు శ్రావణి, హోమియోపతి డాక్టర్ ఆప్సాన, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, పలువురు పాల్గొన్నారు. గ్రామంలో ఐసీడీఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పేదల ఇళ్లు కూలిపోవడంతో నిరాశ్రయులైనవారికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్ కవర్లు పంపిణీ చేశారు. గురువారం సొసైటీ చైర్మన్ పెండ్యాల కిషన్‌రెడ్డి బాధితుల ఇళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా పది ఇండ్లకు టార్పాలిన్ కవర్లు, వంటపాత్రలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

తల్లి పాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి వెంకటగిరి, గుండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సూపర్‌వైజర్లు సుధారాణి, జయప్రదలు చిన్నారులకు తల్లి పాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లులకు వివరించారు. రామడుగు వైద్యాధికారి పవన్‌కుమార్ కళ్లకలక రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినీత, అంగన్‌వాడీ టీచర్లు విజయ, బండారి లక్ష్మీ, గొల్లె లక్ష్మీబాయి, అరుణ పలువురు పాల్గొన్నారు.

నిల్వ నీటిని తొలగించాలి


ఆయిల్‌బాల్స్ వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

చొప్పదండి: ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. తొమ్మిదో వార్డు పరిధిలో గురువారం నిల్వ నీటిలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొత్తూరి మహేశ్, మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

హౌజింగ్‌బోర్డుకాలనీలో టీపీవో పర్యటన


మ్యాప్‌ను పరిశీలిస్తున్న టీపీవో

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ ఇళ్లల్లోకి ఇటీవల వరదనీరు చేరింది. శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జమ్మికుంట మున్సిపల్ టీపీవో శ్రీధర్ కాలనీలో పర్యటించారు. వరద కాలువ నిర్మాణానికి పరిశీలన చేశామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీపతి నరేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


రమేశ్‌బాబు


ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల తహసీల్దార్‌గా గట్ల రమేశ్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

గన్నేరువరం తహసీల్దార్‌గా భిక్షపతి


సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

గన్నేరువరం: గన్నేరువరం మండల తహసీల్దార్‌కుగా భిక్షపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో డీవోగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన అనంతరెడ్డి బదిలీపై కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, రేషన్ డీలర్లు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీటీ మహేశ్‌కుమార్, ఆర్ఐ రజినీస్, సిబ్బంది పాల్గొన్నారు.

రామడుగు తహసీల్దార్‌గా భాస్కర్


పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

రామడుగు: రామడుగు మండల తహసీల్దార్‌గా బదిలీపైన వచ్చిన భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజ్‌కుమార్ పెద్దపల్లికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో భాస్కర్ రాజన్న సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం నుంచి వచ్చా. బాధ్యతలు తీసుకున్న అనంతరం కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైని కలిసిన బీజేపీ నాయకులు


ఎస్సైని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై కె. శ్రీకాంత్‌ను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు లక్ష్మణాచారి, శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రభాకర్, ప్రదీప్‌యాదవ్, మార్కొండ రమేశ్‌పటేల్, మహేందర్, సంపత్, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


మానకొండూర్‌రూరల్: కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె 29 రోజుకు చేరింది. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గన్నేరువరం: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లిలో మాట్లాడారు.

గంగాధర: పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు నాయకులు సంఘీభావం తెలిపారు.

చిగురుమామిడి: జీపీ కార్మికులు, సిబ్బంది చేస్తున్న సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, తక్షణం న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఎనగందుల శంకర్, నిలిగొండ భిక్షపతి, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

శంకరపట్నం: కేశవపట్నంలో జీపీ సిబ్బందికి బీసీ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

తిమ్మాపూర్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. తక్కువ జీతాలు చెల్లిస్తూ సరైన గుర్తింపు ఇవ్వడం లేదని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

పదేళ్లలో పైసా పనిచేయలేదు

సైదాపూర్: పదేళ్లుగా హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పైసా పని చేయలేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొమ్మా శ్రీరాంచక్రవర్తి అన్నారు. గురువారం మండలంలోని గర్రెపల్లి, సోమారం చౌరస్తా, సర్వాయిపేటలో తెగిన రోడ్లను పరిశీలించారు. సైదాపూర్ మండలంలో మట్టి రోడ్లు బీటీ రోడ్లకు నోచుకోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అమలుకు నోచుకోని ప్రకటనలు చేస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు, సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సంతోష్, బీజేపీ నాయకులు మునిగంటి సంతోష్,రమేష్, రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మానకొండూర్:మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కండె లక్ష్మయ్య, టప్పా కొంరయ్య వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

రుణమాఫీపై రైతులు, నాయకుల సంబురాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: ప్రతిపక్షాలు బురద రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హితవు పలికారు.రుణమాఫీని పునః ప్రారంభించాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించడంతో మానకొండూర్‌లో గురువారం బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు హాజరై మాట్లాడారు.

జమ్మికుంట: కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని, రుణమాఫీపై జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ హర్షం వ్యక్తం చేశారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.

హుజూరాబాద్: రుణమాఫీతో సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా నిలిచిపోయారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో పాలాభిషేకం కార్యక్రమంలో చేశారు.

ఇల్లందకుంట: రుణమాఫీ చేయడం హర్షనీయమని జడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎంపీపీ సరిగొమ్ములపావనితో కలిసి క్షీరాభిషేకం చేశారు.

చిగురుమామిడి: చిగురుమామిడిలో బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఎంపీపీ కొత్త వినీత కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులపై అక్కసు వెళ్లగక్కే కాంగ్రెస్ నాయకుల మాటలను తెలంగాణ రైతాంగం నమ్మే పరిస్థితి లేదన్నారు.

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో కేసీఆర్ చిత్రపటానికి వరిపొలంలో రైతులు పాలాభిషేకం చేశారు. కేశవపట్నంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.

గంగాధర: మండలంలోని అన్ని గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

రామడుగు: రామడుగు, వెలిచాల గ్రామాలలో పాలాభిషేకం నిర్వహించారు. కేసీఆర్ రైతు బాంధవుడని కొనియాడుతూ నినాదాలు చేశారు.

నట్టల నివారణ మందులు పంపిణీ


మాత్రలు వేస్తున్న చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో 19 ఏళ్లలోపు పిల్లలకు గురువారం నులిపురుగుల నివారణ మాత్రలు (అల్బెండజోల్) పంపిణీ చేశారు. బాలికలు రక్తహీనతకు లోనుకాకుండా బలవర్ధక ఆహారం తీసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ధూప దీప నైవేద్య కమిటీ



శంకరపట్నం: శంకరపట్నం మండల ధూప దీప నైవేద్య కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దేవరం విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు వేమూరి రమేశ్‌శర్మ, ఉపాధ్యక్షుడు బాలాజీచార్యులు, ప్రధాన కార్యదర్శి భంగిమఠం నాగయ్య, కోశాధికారి భంగిమఠం శివప్రసాద్ ఎన్నికయ్యారు.

33 వంటకాలతో వాయినాలు సమర్పణ



చొప్పదండి: మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో గురువారం అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని అమ్మవారికి 33 రకాల వంటకాలతో వాయినాలు సమర్పించారు. అనంతరం భజన, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

మొలంగూర్ పాఠశాల తనిఖీ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలించారు. విద్యార్థుల సామార్థ్యాలపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. హెచ్ఎం రోజారమణి, టీచర్లు ఉన్నారు.

విద్యార్థుల్లోని సామర్థ్యాల సాధనకు కృషి చేయాలి

జమ్మికుంట: ఉపాధ్యాయులు సులువైన బోధన సామగ్రి తయారు చేసుకొని, విద్యార్థుల్లోని సామర్థ్యాల సాధనకు కృషి చేయాలని సత్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. విద్యాశాఖ కరదీపికలను ఉపయోగించి వార్షిక పాఠ్యప్రణాళిక పీరియడ్‌ల వారీగా సిద్ధం చేసుకొని వర్క్ బుక్స్ అనుసంధానం చేసుకుంటూ విద్యార్థులకు బోధించాలని తెలిపారు. ఎంఈవో శ్రీనివాస్, మండల నోడల్ అధికారి వీర సమ్మయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్‌రావు, హెచ్ఎం ఆకుల సదానందం, రిసోర్స్ పర్సన్స్ సంపత్, సరిత,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం సందర్శన

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషకు సంబంధించి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని సత్యనారాయణరెడ్డి సందర్శించారు. విద్యాశాఖ అందిస్తున్న కరదీపికలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు సామర్థ్యాల సాధన కోసం కృషి చేస్తూ ఆశించిన ఫలితాలను సాధించేలా కృషి చేయాలన్నారు. మండల నోడల్ అధికారి సాంబయ్య, రిసోర్స్ పర్సన్ శ్రీలత, లక్ష్మి, సీఆర్పీ పరమేశ్వర్, అజ్జు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.